


ఓం నమో భగవతే శ్రీ రమణయ

# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 14 పుష్పం : 29-31 5-4-2004

RAMANA BHASKARA

TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 9 ISSUE : 14

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**



ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 2-2-04, విశాఖపట్నం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహప్రారబ్ధాన్ని బట్టి జయం వస్తూఉంటుంది, అపజయం వస్తూఉంటుంది, జీవితంలో లాభం వస్తుంది, నష్టం వస్తుంది, మనం ఎస్‌కేప్‌రూట్ చూసుకోకూడదు, వాటిని ఫేస్‌చేయటం నేర్చుకోవాలి. మనలను అదృష్టం వెంటాడుతూఉన్నా, దురదృష్టం వెంటాడుతూఉన్నా ఇదంతా మాయలో భాగం. మన మనస్సే దానికి ప్రాముఖ్యత ఇచ్చి, మన మనస్సే బాధపడుతుంది. మనస్సుతో తాదాప్యం తగ్గించుకొంటే ఏమీలేదు. ఐయామ్ నతింగ్ అని అనుకోవాలి అంటే గాడ్ ఈజ్ ఎవ్విరితింగ్ అనుకొన్నప్పడు ఐయామ్ నతింగ్ అనుకొంటాము. మనం జీరోలం, మనం ఏమీలేము అనుకొంటే భక్తి, అంతామనమే అనుకొంటే జ్ఞానం. అలాగ వెళ్ళినా, ఇలాగ వెళ్ళినా దుఃఖంలేదు. మనం ఆమార్గానికి చెందం, ఈ మార్గానికి చెందం ఎటూకాకుండా తిరుగుతూ ఉంటాము జీవుడువేరు, గురువువేరు, ఈశ్వరుడువేరు అనే వేరుభావన మనకు ఉంటుంది మన హృదయంలో పొందవలసిన అనుభవం పొందేవరకు ఈ ముగ్గురూ వేరువేరుగా కనిపిస్తారు. మనం పొందవలసిన అనుభవం పొందాక ఇవి మూడూ వేరుకాదు, ఒక్కటే అన్నసంగతి అప్పడు మనకు తెలుస్తుంది. మనకు గుడ్‌హార్ట్ ఎంతముఖ్యమో, గుడ్‌బ్రెయిన్ కూడా అంతే ముఖ్యం. అందుచేత గుడ్‌హార్ట్‌ను, గుడ్‌బ్రెయిన్‌ను సమన్వయం చేసుకొంటూ జీవిస్తూఉంటే దేహాభిమానంలోనుండి విడుదల పొందుతాము అప్పడు జీవించిఉండటానికి, మరణానికి ఉన్న బేధం నశిస్తుంది.

**ఈ సంచికలో......** **సద్గురు శ్రీ నాన్నగారి అనుగప్రాభాషణములు**


02-02-2004 విశాఖపట్నం ........ 1
15-02-2004 ఆకివీడు........ 6
06-02-2004 చించినాడ ........ 11



Visit us @ www.srinannagaru.com




మనకు ఏదైనా అశాంతి వచ్చింది అనుకోండి, నేను అశాంతిగా ఉన్నాను అనుకొంటాము. మనకు ఏదైనా ఆందోళన వచ్చింది అనుకోండి, నేను ఆందోళనగా ఉన్నాను అనుకొంటాము, మనకు ఏదైనా సంతోషం వచ్చింది అనుకోండి, నేను సంతోషంగా ఉన్నాను అనుకొంటాము ఈ సంతోషాలు, అశాంతి, ఆందోళనలు, గర్వం అన్నీ మనస్సులో ఉన్నాయి, ఇది అంతా మనస్సులో ఉన్న పెంట. నీవు ఎవరవు? నీవు ఆత్మవు. నీ మనస్సులోఉన్న గుణాలను తీసుకొనివెళ్ళి నీవు ఏదిగా ఉన్నావో దానితో కలిపేసుకోవటంవలన నీకు దుఃఖంవస్తోంది లేకపోతే ఏమీలేదు. వివేకంతో విడదీసుకొంటే ఏమీలేదు, అసలు యూనివర్స్ అంతా మనకళ్ళఎదురుగా కరిగిపోయినా మనకు డిస్టర్బెన్స్ రాదు.

భగవాన్ ఏమిచెప్పారు అంటే కొంతమంది అనుమానం మనుషులు ఉంటారు, భగవంతుడు ఉన్నాడాలేడా, చైతన్యం అంటూ ఉందాలేదా అని ప్రతీదానికి అనుమానం, అటువంటి అనుమానం మనుషులకు విచారణమార్గం మంచిది అనిచెప్పారు, కొంతమంది జీవితం పొడుగునా విశ్వాసపాత్రులు ఉంటారు, వారికి శరణాగతిమార్గం మంచిది అనిచెప్పారు శరణాగతిలో ఉన్న వైభవం ఏమిటిఅంటే పెరుమాళ్ళే వచ్చి నీకు మోక్షం ఇస్తాను అంటే మోక్షం ఇమ్మని అడుగడు, నీఇష్టం అంటాడు అది శరణాగతి ధర్మం. మనం ఏదైనా భగవంతుడిని అడుగుతాము అనుకోండి, అది భక్తియొక్క అంతస్థుకు భంగం అవుతుంది. భగవంతుడు వచ్చి మోక్షాన్ని ఇస్తాను అంటాడు అనుకోండి, నీఇష్టం అనాలి అంతేగాని యిచ్చేయండి, యిచ్చేయండి అనకూడదు. మనకు ఏమీలేనప్పడు ఎలాగు అణిగిఉంటాము, అన్నీ ఉన్నప్పడు అణిగిఉంటే మనం భగవంతుని దయకు పాత్రులమవుతాము, మన దేహానికి కావలసిన అన్ని కంఫర్ట్సు ఉన్నాయి అనుకోండి, మనం పుట్టింటి దగ్గర అత్తవారి ఇంటిదగ్గర మంచివారి మధ్యన ఉన్నాము అనుకోండి, ఇంత ఆదరణగా చూసే కుటుంబాలలో ఉన్నప్పటికి ఎవడైతే భగవంతుడిని స్మరిస్తూ, భగవంతుడి హృదయానికి సన్నిహితంగా ఉంటాడో వాడు భగవంతుని దయకు తొందరగా పాత్రుడవుతాడు, అకారణభక్తి ఉన్నవాడు తొందరగా భగవంతుని దయకు పాత్రుడవుతాడు.

గాఢనిద్రలో, మనం ఏదైతే కాదో వాటిలో నుండి విడిపోతున్నాము. దేహంలోనుండి, మనస్సులోనుండి, ఇష్టాయిష్టములలోనుండి విడిపోతున్నాము, గాఢనిద్రలో మనకు పొంగిపోవటంలేదు, కుంగిపోవటంలేదు ఎందుచేతనంటే ఇవిఅన్నీ మనస్సులో ఉన్నాయి, గాఢనిద్రలో మనస్సులోనుండి విడిపోతున్నాము కాబట్టి ఈగొడవలు ఏమీ గాఢనిద్రలోలేవు. నిద్రలో ఉండగా జాగ్రదవస్థను మనం తెచ్చుకోగలిగితే అది మనకడసారిజన్మ. దేహానికి రోజూ అన్నం ఎలా పెడుతున్నామో అలాగ మనస్సుకు కూడా రోజూ ఫుడ్‌పెడుతున్నాము. మనలను ఎవరైనా స్తోత్రంచేస్తే పొంగిపోతాము, ఎవరైనా విమర్శిస్తే కృంగిపోతాము, దీని ద్వారా మనస్సు ఫుడ్ తీసుకొంటుంది. దీనివలన హృదయంలో ఉన్న సత్యవస్తువుకు ఆరోజుకా రోజు దూరమయిపోతున్నాము. మనం ఏమనుకొంటున్నాము అంటే ఆవస్తువు వేరు, ఈజీవితంవేరు అని అనుకొంటున్నాము, ఈజీవితాన్ని ప్రోపర్‌గా ఉపయోగించుకొంటే,

ఈజీవితంలో మనం సక్రమంగా బిహేవ్‌చేస్తే ఆవస్తువు మనకు దొరుకుతుంది, అది మన దేహంకంటే, మన ఇంద్రియాలకంటే అతిసన్నిహితంగా ఉంది, మనం చేయవలసింది ఏమిటి అంటే మనస్సుకు పుడ్‌సప్లయి కట్‌చేయాలి.

మనం జయాపజయాలను సమానంగా తీసుకోవాలి, అలాకాకుండా జయం వచ్చినప్పడు పొంగిపోయి, అపజయం వచ్చినప్పడు కుంగిపోతూఉంటే దానివలన మనస్సు పెరుగుతుంది. మనస్సు పెరిగేకొలది నీకు నువ్వు దూరమయిపోతావు, సాధన లక్ష్యం ఏమిటి మనస్సు పల్చబడాలి, మనకి మనం చెడ్డ చేసుకోము, మనకి మనం మంచి చేసుకొంటాము. మనకు మనం మంచి చేసుకొంటూ, ఇతరులకు కూడా మనకు చేతనయినంత మంచిచేస్తూఉంటే సరిపోతుంది, అదికూడా సాధనలో భాగమే. మనకు దుఃఖం వచ్చినప్పడు ఎలా ఉంటుందో ఇతరులకు దుఃఖం వచ్చినప్పడు వారికికూడా అలాగే ఉంటుంది అని అనుకోవాలి. ఇతరులను అగౌరవపరిస్తే మనం నష్టపోతాము, ఇతరులను గౌరవిస్తే మనం లాభం పొందుతాము, మనం చెప్పేమాటలు, టీచింగ్ ఇతరులఫీలింగ్ హర్ట్‌అయ్యేలాగ ఉండకూడదు, ఎదుటివారి ఫీలింగ్ హర్ట్‌అవ్వకుండా ట్రూత్ వైపుకు వాడి ముఖాన్ని త్రిప్పేలాగ టీచింగ్ ఉండాలి, టీచింగ్ సాఫ్ట్‌గా ఉండాలి, స్వీట్‌గా ఉండాలి, దైనందిన జీవితంలో అహంభావనకు పుడ్‌సప్లయి అవ్వకుండా చూసుకొంటే సరిపోతుంది, లోపల ఉన్న సత్యవస్తువు నీకు వ్యక్తమవుతుంది, కొంతమంది సాంప్రదాయబద్ధంగా జీవిస్తూఉంటారు. మనం వికారంగా మాట్లాడినా వారు వికారరహితంగా మాట్లాడుతారు, ఎదుటివాడు వికారముగా మాట్లాడినా మనం వికారరహితంగా మాట్లాడుతూ ఉంటే మనకు పెద్దమనస్సు కలుగుతుంది. చిన్నపనులు కూడా పెద్దమనస్సుతో చేస్తూఉంటే సడన్‌గా మనస్సు ఆరిపోతుంది, బుడగ పగిలిపోయినట్లుగా ఎప్పడో సడన్‌గా మనస్సు పగిలిపోతుంది, నీవు చేసే పని భక్తితో, ప్రేమతో చెయ్యి. మన ఇంటికి చుట్టం వచ్చాడుఅనుకోండి మనకు కాఫీ లేకపోతే కాఫీ ఇచ్చేయనక్కరలేదు, మంచినీళ్ళు యివ్వవచ్చు, అది ప్రేమతో ఇవ్వాలి. నేను కొంతమందిని చూసాను, కోట్ల డబ్బు ఉన్నవారు మీ ఇంటికి వచ్చారు అనుకోండి, వారికి మీరు రవికల గుడ్డ ఇస్తారు అనుకోండి, ఆ రవికలగుడ్డ ఎంత ఇష్టంగా తీసుకొంటారు అంటే నాకు ఆశ్చర్యం, అసలు రవికలగుడ్డ అంతకుముందు చూడలేదు అన్నట్లుగా, ఎంతో ఇష్టంగా దానిని పుచ్చుకొంటారు, ఆబుద్ధి మనకు ఉండాలి, ఆకల్చర్ మనం నేర్చుకోవాలి. సాధనపేరు చెప్పి అస్తమాను రోడ్డుమీద ఉన్న దుమ్ము అంతా మీ మొఖానికి రాసేసుకోనక్కరలేదు, దైనందిన జీవితంలో నార్మల్‌గా ఉండటం, నేచురల్‌గా ఉండటం, సివిలైజ్‌డ్‌గా ఉండటం ప్రాక్టీసు చేస్తే చాలు, దైనందినజీవితంలో మీరు చేస్తున్నపని ప్రేమతో, భక్తితో చేస్తూఉంటే మీరు ఏదైతే పొందుదాము అనుకొంటున్నారో చడీచప్పడులేకుండా, రెండోకంటికి తెలియకుండా క్వయిట్‌గా అందులో ఐక్యమయిపోతారు. నీవు గుర్తింపులు కోసం పనిచేస్తే నీ స్వరూపానికి దూరమవుతావు. నీవులోకం గుర్తింపులు కోరుకొంటున్నావు గాని ఎవడైతే నీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడో వాడి గుర్తింపుకోసం నీవు చూడటంలేదు. నీవు



అదనంగా ఏమీ పనిచేయనక్కరలేదు, భగవంతుడు నీకు ఇచ్చిన పనినే ప్రేమగా భక్తిగా చేస్తూఉంటే నీమనస్సు చాలా తేలిగ్గా, రవ్వంత కూడా నొప్పిలేకుండా శాంతి సాగరంలో ఐక్యమయిపోతుంది. దేవుడు వేరు, లోకం వేరు అని అనుకొంటున్నాము, మనం లోకంలో చేసేపని ఎలాగ ఉండాలిఅంటే దేవుడిలో ఐక్యమవ్వటానికి సహకరించేదిలాగ ఉండాలి. మనం విశాఖపట్నం నుండి కలకత్తా వెళుతున్నాము అనుకోండి, కలకత్తాకు దగ్గరయ్యే కొలది విశాఖపట్నానికి దూరమవుతాము, అలాగే ఈశ్వరచింతన పెరుగుతూఉంటే, ఈశ్వరధ్యానం పెరుగుతూ ఉంటే ప్రకృతికి దూరమవుతాము, అప్పడు నీప్రారబ్ధం తీసుకొనివచ్చే లెంపకాయలుకూడా నీకు ఏమీ అనిపించదు. ఈశ్వరస్మరణలో ఉన్నప్పడు ఆ లెంపకాయల స్పృహే నీకు తెలియదు. నీ మొఖం ఇటుతిప్పేబదులు అటుతిప్పు, నీదేహాన్ని కుదిపేసుకోనక్కరలేదు, బాడి చేసుకోనక్కరలేదు, దానిని కష్టపెట్టేయనక్కరలేదు. నాచేతిలో ఒకపండు ఉంది అనుకోండి ఆపండు ఎక్కడ అవసరమో అక్కడ నేను ఇచ్చానుఅనుకోండి, దానివలన ప్రయోజనం ఏమీలేదు కాని అక్కడ అవసరం కాబట్టి ఇచ్చాముఅంతే, అది సుపీరియర్ యాక్షన్, అలా కాకుండా ఏదో గుర్తింపులకోసం, గొప్పలకోసం, అందరూ మెచ్చుకొంటారుఅని ఆపండు ఇచ్చాము అనుకోండి అది యిన్‌ఫీరియర్ యాక్షన్, నీ దైనందినజీవితంలో ఎప్పడయితే సుపీరియర్‌యాక్షన్‌కు అలవాటుపడ్డావో నీకు స్పిరిట్యువల్‌స్టేటస్ వస్తుంది. నువ్వు అదనంగా ఏమైనా కష్టపడ్డావా, ఇచ్చేది పండే, అంటే ఏమిటి భగవంతుడు చూసేది ఆపండునుకాదు, నీవు ఎవరికి ఇస్తున్నావో అదీకాదు, నీవు ఏ తలంపుతో ఆపండును ఇస్తున్నావు దానినిబట్టి స్పిరిట్యువల్ స్టేటస్ ఇస్తాడు కాని బాహ్యంగా నీవు చేసిన పనినిబట్టి ఈశ్వరుడు మోసపోడు, ఎందుచేతనంటే ఆయన అంతర్యామిగా ఉన్నాడు. దైనందినజీవితంలో నీయాక్షన్ యిన్‌ఫీరియర్‌గా కాకుండా సుపీరియర్‌గా ఉంటే నీకు జ్ఞానం వచ్చేస్తుంది. మైండ్‌లో కన్‌ఫ్యూజన్ పెట్టుకోకుండా మైండ్‌లో క్లేరిటీవస్తే జ్ఞానం వచ్చేస్తుంది.

ఒక రెడ్డిగారికి ఈమధ్యన మనవడు పుట్టాడు, ఆ కోడలకు మావగారుఅంటే ఇష్టం ఉండదు కాని మావగారికి కోడలు అంటే ఇష్టమే, మామూలుగా ఆయన మనవడిని చూడటానికి వెళ్ళారు. మీకు కూడా ఇటువంటి సమస్యలు వస్తూఉంటాయని చెపుతున్నాను, ఆయన వెళ్ళారు, కూర్చొన్నారు, కాఫీ ఇచ్చారు మనవడిని చూస్తాను అంటే మేము చూపించము అని కోడలు చెప్పింది. రెడ్డిగారు తిరిగి వచ్చేశారు. వారికి ఏవో గొడవలు ఉండవచ్చు అందులోకి మనం వెళ్ళవద్దు. ఈమధ్య ఆరెడ్డిగారు నాతో మాట్లాడుతూ నాన్నగారు మాకు మనవడు పుట్టాడండీ, చూడటానికి వెళ్ళాను, కాఫీఇచ్చారు కాని మామనవడిని చూపించము అన్నారండి, తిరిగి వచ్చేశాను అని ఏమీవికారం లేకుండా, బాధలేకుండా చెబుతున్నారు, ఆయన భక్తుడు. ఆకోడలు మీద కోపంపెట్టుకొని నాదగ్గర మర్యాదకోసం అలా చెప్పటంకాదు, ఆశ్చర్యం ఆయన మొఖంలో ఏమీ వికారంలేదు, ఎంతో నిర్మలంగా చెబుతున్నారు, మనకంటే ఆయనకే ముందు మోక్షం వస్తుందని నాకు

అనిపించింది. కొంతమంది అన్నం తినేటప్పడు కూడా ఒంటరిగాఉంటే ఒకలాగ తింటారు, నలుగురిలో ఉంటే ఒకలాగ తింటారు, ఒంటరిగా ఉన్నప్పడు 5,6 బూరులు తినేస్తారు, పంక్తిలో కూర్చొన్నప్పడు వద్దండి, వద్దండి అంటారు, అది కృత్రిమజీవితం అంటున్నారు భగవాన్. మీరు నార్మల్‌గా ఉండండి, నేచురల్‌గా ఉండండి లోపలఉన్న వస్తువు నార్మల్‌గా, నేచురల్‌గా ఉంది, మీరు కూడా అలాగ ఉంటే అందులో ఐక్యమయిపోతారు. మమ్మల్ని పెళ్ళిచేసుకోమంటారా అని ఎవరైనా భక్తులు భగవాన్‌ను అడిగితే భగవాన్ ఎంత సహజంగా చెప్పేవారు అంటే నీకు పెళ్ళి అంటే ఇష్టం లేకపోతే మానెయ్యి, పెళ్ళిచేసుకొంటే బాగుండును అనే తలంపు వస్తూఉంటే పెళ్ళిచేసుకో. నువ్వు పెళ్ళిచేసుకోకుండా ఉండి కాలిపోయే బదులు, పెళ్ళి చేసుకొని సుఖపడు అని చెప్పారు. నువ్వు ఉద్రేకంగా ఉన్నప్పడు వచ్చిన తలంపులను పట్టించుకోవద్దు మొదటితలంపు ఏదో వస్తుంది దానికూడా వెళ్ళిపోవద్దు మొదటితలంపు కొంచం వేడిగా ఉంటుంది, దానిని పట్టుకొనివెళితే నువ్వు నిప్పలో పడతావు అలా తలంపులను రానియ్యి, ఆఖరిని వచ్చే తలంపు సైలెంట్‌గా ఉంటుంది, అది ట్రూత్‌కు దారి చూపిస్తుంది అని ఒక లాయర్‌గారు చెప్పారు. మీరులేరు, నేనులేను, ఉన్నది ఒక్కటే, అదే బ్రహ్మం. ఉన్నది బ్రహ్మం ఒక్కటే అనే భావం నీకు స్థిరపడినప్పడు, ఆస్టెబిలిటీ వచ్చినప్పడు ఆయన దయ మహాప్రవాహంలాగవచ్చి మన సహస్రారాన్ని ముంచుతుంది, మీరు ఏదోగొప్పగా జీవిస్తే ఆత్మసాక్షాత్కారం తొందరగా వచ్చేస్తుంది అని మీరు అనుకొంటున్నారు. గొప్పగా జీవించటంకాదు, సహజంగా జీవిస్తే వస్తుంది ఎందుచేతనంటే అది సహజంగా ఉంది, లోపలఉన్న వస్తువు కాంప్లికేటెడ్‌గాలేదు కాని మన బ్రెయిన్ కాంప్లికేటెడ్‌గా ఉంది. ఈకాంప్లికేటెడ్‌గాఉన్న బ్రెయిన్‌లోనుండి విడుదల పొందితే ఆవస్తువు మనకు దొరుకుతుంది. దయ హృదయంలో ఉంటుంది, వివేకం తలకాయలో ఉంటుంది, ఈరెండింటిని సమన్వయం చేసుకొంటూ జీవించాలి. వివేకం దయాపూరితంగా ఉండాలి, దయ వివేకపూరితంగా ఉండాలి రెండూ కలుపుకోవాలి అప్పడు మనసాధన బేలెన్స్‌డ్‌గా ఉంటుంది. మనకు ప్రతీ విషయంలోను పాజిటివ్‌తింకింగ్ ఉండాలి. మనకు ఎప్పడైనా నష్టం వచ్చింది అనుకోండి, ఆనష్టం ఎందుకువచ్చిందో మనకు తెలియదు, భగవంతుడికి తెలుస్తుంది ఆనష్టంకూడా మనకు ఒకరకంగా మంచిని తీసుకొనిరావచ్చు ప్రతీవిషయంలోను పాజిటివ్‌తింకింగ్ వలన స్పిరిట్యూవల్ స్టేటస్ పెరుగుతుంది.

మనం మోక్షం పొందటానికి ఈభూమి మీదకు వచ్చాము, వచ్చినపని మర్చిపోకూడదు, ఆపని పూర్తి చేసుకోవాలి, మిగిలినవన్నీ సెకండరీ. నాకు మోక్షం కావాలిఅని ఒక భక్తురాలు భగవాన్‌ను అడిగితే నీలోపల ఉండి, మోక్షం కావాలని ఎవడైతే అడుగుతున్నాడో వాడిని బయటకు తోలెయ్యి, అప్పడు ఉన్నదే మోక్షం అన్నారు భగవాన్. కష్టపడి ఏదో సాధన చేయటంకాదు, లోపల ఈశ్వరునిదయ, గురువుయొక్క దయ ఆస్పర్శ మనకు తెలుస్తోంది అనుకో అసలు ఊపిరి నలపదు. మన శరీరం పుట్టటం, శరీరం చనిపోవటం ఫిక్షన్. దురదృష్టం ఎంత ఫిక్షనో అదృష్టం కూడా అంతే ఫిక్షన్. ఏదో



చెయ్యటంవలన అది వచ్చింది గాని అది సహజంకాదు, సబ్జక్టులో లోతుకు వెళ్ళిచూస్తే ఏమీలేదు. బుడగలు, కెరటాలు, నురుగులు ఇవిఅన్నీ సముద్రంపైనే, లోపలకు వెళితే ఏమీలేదు అలాగే ఈచావుపుట్టుకలు, కర్మసిద్ధాంతాలు మీకు సర్‌ఫేస్‌లో అలా కనిపిస్తాయి, లోతులకు వెళితే ఏమీలేదు, అంతా ఫిక్షన్. గురువు యొక్క దయ మాత్రం ఫిక్షన్ కాదు, ఈచేయి ఆచేయిని ముట్టుకొన్నప్పడు ఆ టచ్ ఎలా తెలుస్తుందో అలాగ గురువు యొక్క దయ లోపల ఆస్పర్శ మనకు తెలుస్తుంది, గురువుయొక్కదయ, ఆస్పర్శ మనకు తగిలినప్పడు 24గంటలు 24 క్షణాల క్రింద వెళ్ళిపోతుంది, ఈ క్రియేషన్ ఏపాటిది అని ఆటైములో మనకు అనిపిస్తుంది. ఎవ్విరిథింగ్ ఈజ్ ఫిక్షన్ ఎక్సెప్ట్ గురూస్ గ్రేస్.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 15-02-04 ఆకివీడు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన చైతన్యస్థాయి పెంచుకోవటానికి, మనం వివేకంగా జీవించటానికి, మనం శాంతచిత్తం సంపాదించుకోవటానికే ఈ జ్ఞానయాజ్ఞలు. ముందు ఏకాగ్రత సంపాదిస్తే మనం అన్నీ సంపాదించవచ్చు. ఏకాగ్రతలేని మనిషి ఈలోకంలో ఏమీ సాధించలేడు. ఏకాగ్రతలేని మనిషి, మనోనిగ్రహంలేని మనిషి మోక్ష సుఖాన్ని పొందలేడు. అన్ని సుఖాలకంటే మోక్షసుఖం గొప్పది. ఉదాహరణకు మనం ఏదో సినిమా చూస్తున్నాము, ఆ బొమ్మలు మనకు ఏదోకొంత సంతోషాన్ని కలుగజేస్తాయి. మీకు ఇష్టమైన పదార్థం తింటూఉంటే అది మీకు కొంత సంతోషాన్ని కలుగజేస్తుంది, మీరు ఏదైనా వ్యాపారం చేస్తూఉంటే అందులో లాభంవస్తే మీరు సంతోషిస్తారు. మీకు పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఆ అనుకూలపరిస్థితులు మీ సంతోషానికి కారణాలు అవుతాయి. ఇలా ఒక కారణం వలన వచ్చే సంతోషం పరిణామంలో ఆ కారణం భంగం అయ్యాక, అది దుఃఖం క్రింది మారిపోతుంది. ఇక్కడ మీరు అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటిఅంటే మీకు పరిస్థితులు అనుకూలంగా ఉంటే పొంగిపోవద్దు, ఇముడ్చుకోండి. మీకు పరిస్థితులు అనుకూలంగా లేకపోతే కృంగిపోవద్దు. పొంగిపోవటం, కృంగిపోవటం ఇవి అహంకారం యొక్క వికారములు. ఈ వికారములు తగ్గితేనేగాని అహంకారం నశించదు, అహంకారం నశిస్తేగాని ఆత్మజ్ఞానం కలుగదు. గాఢనిద్రలో మనం సుఖంగా, శాంతిగా, ఆనందంగా ఉన్నాము. గాఢనిద్రలో మనకు ఈటింగ్‌లేదు, సీయింగ్‌లేదు, లేకపోతే మన అంగబలం, అర్థబలం చూసుకొని ఆసంతోషం రావటంలేదు. గాడనిద్రలో మన మనస్సు అది ఎక్కడయితే ఉదయిస్తోందో అక్కడికివెళ్ళి కలిసిపోతుంది, అప్పడు కారణంలేని సుఖం, హేతువులేని సుఖం గాఢనిద్రలో మనం అనుభవిస్తున్నాము. అది నిజమైనసుఖం. ఆ కారణంలేని సుఖాన్ని మనం జాగ్రదవస్థలో పొందాలి, దానికి శిక్షణ పొందటానికే మనం ఈభూమి మీదకు వచ్చాము.

మనం నిద్రలో ఉన్నంతసేపు కలలు వస్తూ ఉంటాయి అలాగే మనం అజ్ఞానం అనే నిద్రలో ఉన్నంతకాలం జన్మలు వస్తూ ఉంటాయి. అజ్ఞానం నుండి బయటకు వస్తే జన్మలు ఆగిపోతాయి, ప్రకృతివాడిని విడిచిపెట్టేస్తుంది, మాయవాడిని విడిచిపెట్టేస్తుంది. రాగద్వేషములే సంసారానికి పునాదిరాళ్ళు, మనుషులుకాదు. రాగద్వేషములు లేకపోతే సంసారంలేదు. సమాజంలో ఎక్కడికి వెళ్ళిచూసినా రాగద్వేషములు తప్పించి ఏమీలేదు. ఈ రాగద్వేషములు అనే పునాది మీదే సంసారం ఆధారపడిఉంది. ఈ రాగద్వేషములు పోవు అనుకోండి మరల జన్మ వస్తుంది, జన్మవస్తే సంసారం వస్తుంది. అసలు బేసిగ్గా ఈ సంసారానికి కారణం ఏమిటి అని ఆ కారణాన్ని తొలగిస్తేగాని సంసారం ఆగదు, జన్మలు ఆగవు. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొంటూ, ఏది నిత్యం ఏది అనిత్యం అని విడదీసుకొంటూ, వివేకాన్ని పెంచుకొంటూ జీవిస్తూ ఉంటే రాగద్వేషములు నశిస్తాయి. దొంగ చేతిలో ఉన్న కత్తి మనకు అపకారం చేస్తుంది, అదే డాక్టరు చేతిలో ఉన్న కత్తి మనకు ఉపకారం చేస్తుంది. అలాగే మంచివారి దగ్గర ఉన్న డబ్బు, తెలివి సమాజానికి ఉపయోగపడుతాయి, చెడ్డవారి దగ్గర ఉన్న తెలివి, డబ్బు సమాజానికి అపకారం చేస్తాయి. ఇతరుల గొడవ మనకు అనవసరం, మనకు సంబంధించినంత వరకు భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను మనకు ఉపయోగించుకోవచ్చు, సమాజానికి కూడా ఉపయోగించాలి. మనకు మనం ఉపకారం చేసుకొంటూ ఇతరులకు కూడా ఉపకారం చెయ్యాలి. మనకు ఏది మంచి అనుకొంటామో అదే ఇతరులకు చెయ్యాలి, మనకు ఏది చెడ్డ అనుకొంటున్నామో ఆచెడ్డ ఇతరులకు చేయకూడదు. ఇలా తెలివిగా, బుద్ధిసూక్ష్మతతో జీవిస్తూఉంటే రాగద్వేషములనే ఏనుగులుచస్తాయి కాని లేకపోతే ఆఏనుగులు పీనుగులు అవ్వవు. ఆ ఏనుగులను పీనుగులు చెయ్యటానికే మన సాధన. అవి అంత తొందగా పీనుగులు అవ్వవు. కాలం కలిసిరావాలి, ఈశ్వరునిదయ ఉండాలి, మనకు అకారణభక్తి ఉండాలి. సీతారామ లక్షణులను గుహుడు నదిని దాటిస్తాడు. అప్పడు వారు నారబట్టలను ధరించి ఉంటారు. నారబట్టలతో రాముడిని చూసి గుహుడు ఒకమాట అంటాడు. ఓ పరమాత్మ నీవు నారబట్టలు కట్టుకోవటం ఈ కళ్ళతో చూడవలసి వస్తోంది, ఈ రెండు కళ్ళూ నాకు లేకపోయినా వదిలిపోను అంటాడుగుహుడు. వాడి ప్రేమ చూడండి ఆశ్చర్యం, అది అకారణభక్తి, అటువంటి అకారణభక్తి ఉంటే రాగద్వేషములనే ఏనుగులు పీనుగులు అవుతాయి.

ఇప్పడు మనకు రమణమహర్షి మీద కోపం వస్తుంది అనుకోండి, రామకృష్ణ పరమహంస మీద కోపం వస్తుంది అనుకోండి, వాళ్ళు స్థితప్రజ్ఞులు, జ్ఞానులు, మనకోపం వారికి గుచ్చుకొంటుందని మనం అనుకొంటాము గాని వారికి ఎలాగూ గుచ్చుకోదు సరికదా తిరిగివచ్చి మనకే గుచ్చుకొంటుంది. సూర్యుడిని చూసి మనం ఉమ్మువేసాము అనుకోండి, అది సూర్యుడి మీద ఎలాగుపడదు, అది తిరిగివచ్చి మన మీదే పడుతుంది. ఇది మనకు తెలియక అకారణంగా ఎవరో ఒకరిమీద అసూయ పడుతూ ఉంటాము, ఎవరో ఒకరికి



దుఃఖాన్ని తీసుకొని వస్తూఉంటాము. మన స్వభావం ఎలాగ ఉంటుంది అంటే ఎవరైనా పడిపోయారు అనుకోండి, వారిని లేవదీయము, లేవదీయకపోయినా ఫరవాలేదు, వారిని చూసి సంతోషిస్తాము. దీనిని బట్టి మనం మానసికంగా ఎంత వెనుకబడి ఉన్నామో మనకు తెలుస్తుంది. వారుపాడైపోయారు అని ఎవరి గురించి అయినా అనుకొంటాము అనుకోండి, వారు పాడవ్వరు చివరకు మనం పాడైపోతాము, ఇలాగ మనలను మనం గుచ్చుకొనేపనులు చేయకూడదు. మన కళ్ళను మనమే పోగొట్టుకొంటాము అంటే ఎలాగ? మన సొంత పనులు ఎలాగ చేసుకొంటున్నామో ఆఫీసులో కూడా అలాగ పనిచేస్తున్నాము అనుకోండి, అప్పడు మనస్సు సమానం అవుతుంది. మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. ఎప్పడైతే మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోయిందో మనస్సు నశిస్తుంది, వాడు ఇంక శరీరగుహలోనికి రానక్కరలేదు. భగవంతుడు మనకు కేటాయించిన పనిలోనుండి తప్పించుకొందాము అనుకొన్నా తప్పించుకోలేము, భగవంతుడు మనకు ఇవ్వని పనిని మనం చెయ్యాలన్నా చేయలేము. దానికి పనికిరాము, దీనికి పనికిరాము. ఈశ్వరుడు మాత్రమే స్వతంత్రుడు, జీవుడు స్వతంత్రుడుకాదు భగవంతుడు మనకు ఇచ్చిన పనిని ఇష్టంగా, ప్రేమగా చేస్తే దేహాభిమానం నశిస్తుంది. రాగద్వేషములను తగ్గించుకొంటే మనకు తెలియకుండానే అజ్ఞానంలోనుండి విడుదల పొందతాము. భగవంతుడు కర్మఫలదాత. నీవు లోపల చెడు ఉద్దేశం పెట్టుకొని బయట మంచిపని చేస్తే ఒకరకమైన ఫలితం వస్తుంది, లోపల మంచి ఉద్దేశం పెట్టుకొని బయట మంచిపనిచేస్తే ఒకరకమైన ఫలితం వస్తుంది, ఇవన్నీ భగవంతుడు చూసుకొని నీకు ఫలితాన్ని ఇస్తాడు కాని ఫలితం ఆయనకు అక్కరలేదు, అది దృష్టిలో పెట్టుకోండి.

మనం నేను, నేను అంటున్నాము కదా, ఆ నేనును విడిచిపెట్టటమే సన్యాసము. మీరు నన్ను స్తోత్రం చేస్తారు అనుకోండి, దేహం పొంగదు, ఈ నేను పొంగుతుంది, మీరు నన్ను విమర్శిస్తున్నారు అనుకోండి, ఈనేను కృంగిపోతుంది ఇక్కడ నేను ఉంది కాబట్టి అది పొంగుతోంది, అది కృంగుతోంది, ఆ నేనును విడిచిపెట్టటమే నిజమైనసన్యాసం. దేహంతో తాదాప్యం పొందే నేను ఉన్నప్పడు పుణ్యం ఉంది, పాపం ఉంది, మంచి ఉంది, చెడు ఉంది అన్నీ ఉన్నాయి, ఆనేనునుండి విడుదలపొందితే, అది లేనప్పడు ఏదీలేదు, ఉన్నది ఒక్కటే, అదే బ్రహ్మం. విషయచింతనలో నుండి మనస్సును మళ్ళించి నిరంతరము దైవచింతన చేస్తూ ఉంటే, ఆ చేసేది నశిస్తుంది, బ్రహ్మం నీకు స్వరూపముగా వ్యక్తమవుతుంది. మనకు విషయాల మీద ఉన్న ఇష్టం భగవంతుడి మీదలేదు, దానికి మన బుద్ధిలోఉన్న దోషాలు కారణం. మనం భగవంతుడు చెప్పిన మాటలను శ్రవణంచేసి, భగవంతుడి వాక్యానికి అనుగుణంగా జీవిస్తూ ఉంటే మన బుద్ధిలో ఉన్న దోషాలు నశిస్తాయి. భగవంతుడికి రూపం అక్కరలేదు కాని ఆయన మన కోసం రూపం ధరించివస్తాడు, ఎందుకంటే మన మనస్సుకు లోచూపు కలుగజేసి, బ్రహ్మానుభవంపొందటానికి ప్రిపేర్‌చేసి, మనస్సును సమాయత్తంచేసి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. విషయచింతన వలన

బుద్ధిలో దోషాలు పెరుగుతాయి, బ్రహ్మచింతనవలన బుద్ధిలో ఉన్న దోషాలు తగ్గుతాయి. ఈ దేహం ఉంటే మనం ఉంటాము, దేహంపోయినప్పడు మనం పోతాము అని మనం అనుకొంటున్నాము. దేహం ఉండటానికి, దేహం పోవటానికి మధ్యన బేధం తెలుస్తూ ఉంటే మనకు పునర్జన్మ వచ్చేస్తుంది,ఇది బాగా గుర్తుపెట్టుకోండి. దేహానికి మరణం వస్తూ ఉంటే మనకు భయం కలుగుతుంది. దేహానికి భయం కలుగదు, ఈ దేహము నేను అని ఏనేను అయితే అనుకొంటోందో ఆనేనుకు భయం కలుగుతోంది. ఎందుచేతనంటే ఈ దేహమే నేను అని అది అనుకోంటోంది, దేహంపోతే నేను ఉండను అని అనుకొంటోంది. అందువలన దానికి భయం కలుగుతుంది. దేహముపోతే నేను ఉండను అని ఏ నేను అయితే అంటోందో ఆనేనుకు మృత్యుభయం ఉంది, అది నశించే వరకు నీవు అభయస్థితిని పొందలేవు.

భగవంతుడు మనహృదయంలో ఉన్నాడు, ఆయన సర్వసాక్షి ఆయనకు తెలియకుండా ఈసృష్టిలో ఏమిజరగటానికి వీలులేదు.  ఎవడైతే ఈఖగోళాన్ని నడుపుతున్నాడో, ఈసూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలను, పంచభూతాలను ఎవడైతే నియమిస్తున్నాడో, ఆనియమించేవాడు మనహృదయంలో కూడా ఉన్నాడు అన్న సంగతి మీరు మర్చిపోవద్దు, ఇది జ్ఞాపకం పెట్టుకోండి, వాడువీడు వేరుకాదు, వాడి అనుగ్రహం లేకుండా వాడిదయలేకుండా ఆత్మజ్ఞానం అసాధ్యం.  వాడిదయ ఉంటే అసాధ్యం అంతా సాధ్యం అవుతుంది మీ కుటుంబసభ్యుల పట్ల మీడ్యూటి మీరు చేయండి, వారు బాగుపడతారో లేదో వారి ప్రారబ్ధాన్నిబట్టి ఉంటుంది.  మమకారం విడిచిపెట్టి పనిచెయ్యండి, అప్పడు అది మిమ్మల్ని బంధించదు, వారు బాగుపడితే గర్వంరాదు, వారు పాడైపోయినా మీకు దుఃఖంరాదు. మమకారాన్ని విడిచిపెట్టి పనిచేయటం వలన అక్కడ పనీ పూర్తి అయిపోతుంది, మోక్షం పొందటానికి మనస్సు ప్రిపేర్ అయిపోతూ ఉంటుంది. ఎవడో చుట్టంరేపు వస్తాడు అని ఉత్తరం వ్రాసాడు అనుకోండి ఈరోజు నుండే కంగారు పడిపోతూ ఉంటాము. ఎందుకు అంత టెన్షన్? మనకు ఏది ఉంటే అదే పెడదాము, ఇంక టెన్షన్ ఎందుకు. ఏదో వాడిని గొప్పగా గౌరవించేయాలి అనుకొంటాము అక్కడనుండి టెన్షన్ ప్రారంభమవుతుంది. మనకు ఏది ఉంటే అది పెట్టాలి, మనలను గౌరవించలేదు అనివాడు అనుకొంటే మనకు వచ్చిన నష్టంలేదు. మనకు కిరీటాలు ఉంటే కదా పోవటానికి, మనకు ఎలాగు కిరీటాలులేవు. ఇది ఒకటే మీరు గుర్తుపెట్టుకోండి, దేహముతో తాదాప్యంపొందే తలంపు లేనివాడికి దేహానికి ఎటువంటి ప్రారబ్దం ఉన్నా ఎర్రచీమకుట్టినట్లు కూడా వాడికి ఉండదు.

జాగ్రదవస్థలో మనం పొందే సంతోషాలు అన్నీ కారణం మీద ఆధారపడి ఉన్నాయి, జాగ్రదవస్థలో మీరు విషయచింతనకు దూరంగా ఉండి, ఈశ్వరుని నిరంతరం చింతిస్తూ ఉంటే బుద్దిలో ఉన్న దోషాలు అన్నీ వేరుతో సహా నశించి, గాఢనిద్రలో అకారణసుఖాన్ని ఎలా పొందుతున్నారో అలాగ జాగ్రదవస్థలో కూడా అకారణసుఖాన్ని పొందుతారు. ఈశ్వరస్మరణవలన బుద్ధిలో ఉన్న దోషాలు నశించటమే కాదు, ఏ తలంపు అయితే దేహంతో



తాదాప్యం పొందుతోందో ఆ మొదటి తలంపు వేరుతో సహా నశిస్తుంది, అప్పడు వాడిప్రేమ విశ్వవ్యాప్తమవుతుంది. భగవాన్ ఏమంటున్నారు అంటే దేహం చనిపోకముందే దేహంతో తాదాప్యం పొందే బుజ్జిగాడు చనిపోతే, ఇప్పడు నీ ప్రేమ కుటుంబానికి పరిమితం అయ్యిందిగాని అప్పడు వాడి ప్రేమ కుటుంబంతోటి, కులంతోటి, మతంతోటి సంబంధంలేకుండా విశ్వవ్యాప్తమవుతుంది. ఈ చిన్నగడపను దాటితే సరిపోతుంది, ఈ బుజ్జిగాడిని తొలగించుకొంటే సరిపోతుంది కాని వాడే సర్వస్వం అని మనం అనుకొంటున్నాము, ఇంకవాడిని ఎలా పోగొట్టుకొంటాము. మనలో పొరపాటు ఏమిటి అంటే అందరూ మన మనస్సుకు నచ్చినట్లుగా ఉండాలి అనుకొంటాము. అలా ఎందుకు ఉంటారు? వారి పూర్వజన్మలువేరు, వారి పద్ధతి ప్రకారం వారు ఉంటారు. ఒకేలాగ ఉండటానికి మనం ఏమైనా పంచదార చిలకలమా? అందరూ మన మనస్సుకు నచ్చినట్లుగా ఉండాలి అనుకొంటాము అనుకోండి, అది మన అజ్ఞానానికి గుర్తు. కొంతమంది ప్రతీదానికి కుటుంబంలో వారి మాటే చెల్లాలి అనుకొంటారు. కొంతమంది తెలివైనవారు ఎలా ఉంటారు అంటే వారి అభిప్రాయం చెపుతారు, మీ అభిప్రాయం కూడా చెప్పండి, అది బాగుంటే అలా చేద్దాము అంటారు. ప్రతీదానికి నా మాటే చెల్లాలి అంటే కుటుంబం నష్టపోతుంది, రాజీపడటం కూడా నేర్చుకోవాలి. మనం ఎలా ఉండాలో భగవాన్ చెపుతున్నారు. మనం చేసేపని నిర్మలంగా ఉంటే, నిశ్చలంగా ఉంటే, మనం ఇతరుల విషయాలలో కలుగజేసుకోకుండా ఉంటే, మన ప్రవర్తన వివేకవంతంగా ఉంటే, రాగద్వేషరహితముగా ఉంటే బాగాపండినపండు మనం కర్రతో కూడా ముట్టుకోకుండానే ఏవిధంగా అయితే చెట్టునుండి రాలిపోతుందో, అలాగ మన దేహాభిమానం దానంతట అదే సహజంగానే రాలిపోతుంది, అప్పడు నదివెళ్ళి సముద్రంలో కలిసినట్లుగా మనం బ్రహ్మంలో ఐక్యమయిపోతాము. నీవు పనిద్వారా తగిన శిక్షణ పొందకుండా, నీవు ముగ్గకుండా ఎక్కడికో పారిపోతే నీకు మోక్షంరాదు కదా వెర్రితనం వస్తుంది, పిచ్చివాడివి అయిపోతావు. అందుచేత  ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టవద్దు, ఈశ్వరస్మరణ విడిచిపెట్టవద్దు.

మీ మనస్సుతో మీరు అస్తమాను దెబ్బలాటలు పెట్టుకోవద్దు. మీ పని మీరు శ్రద్ధగా చేసుకొంటూ, వ్యక్తిభావన లేకుండా జీవించ గలుగుతూఉంటే, మీమనస్సును మీఇష్టదైవం మీద పెట్టి ఆనామాన్ని స్మరించుకొంటూ, ఆరూపాన్ని ధ్యానించుకొంటూ ఉంటే, ఈశ్వరుడు చెప్పినమాట మీకు ఇష్టం లేకపోయినా, ఆమాటనుహితవు చేసుకొని, ఆమాటను ప్రేమించి, ఆయన చెప్పినట్లుగా జీవిస్తూ ఉంటే చెరుకురసం తాగేటప్పడు నెమ్మదిగా ఆతీపిదనాన్ని అనుభవిస్తూ ఎంతఇష్టంగా తాగుతారో అంతఇష్టంగా మీమనస్సు వెళ్ళి ఈశ్వరుడిలో లయమయి పోతుంది. అప్పడు దేహం ఉండటానికి, దేహం పోవటానికి బేధం ఊడిపోతుంది, అప్పడు ప్రపంచం కనిపించినా కనిపించకపోయినా మీకు తేడా ఏమీ తెలియదు, ఈ సృష్టి స్థితిలయాలకు అతీతంగా ఉంటారు. నీటిలో పడవ ఉండవచ్చుగాని పడవలో నీరు ఉండకూడదు. అలాగే నీడ్యూటీ ఏదో నీవు చేసుకొంటూ

పో, అంతేగాని అస్తమానూ నీ తలకాయలో ఇంట్లో వారిని మోయవద్దు. నీవు ప్రాపంచిక జీవితానికి విడాకులు ఇవ్వకుండా, ప్రపంచంలో ఉంటూనే ట్రైనింగ్ అయ్యి, ముగ్గిపోయి రాలిపోవాలి, అంటే దేహాభిమానంలో నుండి రాలిపోవాలి. నువ్వు ఎవరిగా ఉన్నావో అది మర్చిపోవద్దు. నువ్వు ఎవరవు? నీలోపల ఉన్న జననమరణములులేని వస్తువేనీవు. నేను అనే తలంపు పుట్టక ముందు నువ్వు ఏదిగా ఉన్నావో అదే నీవు. దాని తాలుక ఎఱుక విడిచిపెట్టవద్దు, దాని తాలుక అనుభవం పొందేవరకు ఇలా జన్మించటం, మరణించటం తప్పదు, మాయ దారి ఇవ్వదు, కామక్రోధములు ఏనుగులు లాంటివి, ఈ ఏనుగులు అంత తొందరగా స్వాధీనంలోనికిరావు, సాధన అనే అంకుశంతో ఈ కామక్రోధములనే ఏనుగులను స్వాధీనం చేసుకో.

మనం ఇతరులను ద్వేషించటానికి ఏదైనా కారణం ఉన్నప్పటికీ ద్వేషరహితంగా ఉండాలి, కోపకారణం ఉన్నప్పటికీ కోపరహితంగా ఉండాలి. అలాకోపరహితంగా ఉండము అనుకోండి మనకు ఎవరిమీద అయితే కోపం వచ్చిందో మన కోపం వాడికి గుచ్చుకున్నా, గుచ్చుకోకపోయినా తిరిగివచ్చి మనకు మాత్రం గుచ్చుకొంటుంది, ఇలా ఎన్ని ముళ్ళను గుచ్చుకొనేలా మనం చేసుకొంటాము. ఆత్మస్తుతి, పరనింద ఉన్నవారి దగ్గర కూర్చోవద్దు, అబద్దాలు చెప్పి అయినా అక్కడ నుండి తప్పకోవటం మంచిది. పదిసంవత్సాలు మంచి స్నేహాలు చేసి ఒక ఆరునెలలు చెడుస్నేహం చేస్తే ఈ పదిసంవత్సరాలు మంచిస్నేహం చేసి మనం సంపాదించిన సద్బుద్ది అంతా ఈ ఆరునెలలలో పోతుంది, అందుచేత బహుజాగ్రత్తగా ఉండాలి. కత్తి అంచుమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉంటాడో ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలనుకొనేవాడు అంత జాగ్రత్తగా ఉండాలి అని ఉపనిషత్‌లలో చెప్పారు. అవినయంరాకుండా చూసుకోవాలి. మాటలో ఆడంబరం పనికిరాదు. అవునంటే అవునని చెప్పండి, కాదంటే కాదని చెప్పండి, మీకు తొయ్యటంలేదు అనుకోండి, కంగారుపడి కమిట్ అవ్వవద్దు, ఆలోచించి చెపుతాము అని చెప్పండి. మీకు చేతనయితే ఇతరుల తెలివితేటలు పెంచండి, అంతేగాని వారికి ఉన్న తెలివితేటలు తగ్గించేయవద్దు. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఆధ్యాత్మికఅభివృద్ధి పొందటంకోసం కేవలం భౌతికజీవితానికి విడాకులు ఇవ్వనక్కరలేదు. వినయంతో కూడిన జీవితం, శాంతచిత్తముతో కూడిన జీవితం, నమ్రతతో కూడిన జీవితం మనకు అమృతానుభవమును కలుగజేస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 6-03-04, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ శరీరం మరణించాక కొంతమందికి తొందరగా మరల శరీరం రావచ్చు, కొంతమందికి ఎక్కువకాలం పట్టవచ్చు మరల మానవశరీరం రావాలని లేదు వాడి కర్మానుభవాన్ని బట్టి ఆ జీవుడికి ఏదో శరీరం వస్తుంది, కాని ఏశరీరం వచ్చినా ఆశరీరంతో



తాదాప్యం పొందిఉంటాడు. మన శరీరం అంటే మనకు ఎంత ఇష్టమో జంతువులకు కూడా వాటిశరీరం అంటే వాటికి అంత ఇష్టం. జీవుడికి వాడు ఏదేహంలో ఉంటే ఆ దేహం ఒక్కటే నిజం, అదే సర్వస్వం అని అనిపిస్తుంది. మంచి చేసినవాడికి దుర్గతిలేదు అని పరమాత్మ చెప్పాడు. మనం ఏదైనా మంచిపనిచేస్తే ఆఫలితం వెంటనే మనకు అనుభవంలోనికి రాకపోయినా మనం ఏ శరీరంలోఉన్నా, ఏలోకంలోఉన్నా ఆ ఫలితాన్ని మనకు భగవంతుడు కేటాయిస్తాడు. నీవు ఇతరులకు చేసిన సహాయసహకారములు అంతా నీకే తిరిగివచ్చేస్తుంది, ఇది నీకు అర్థమయితే ఇతరులకు సహాయసహకారములు అందించకుండా ఎలా ఉండగలవు అన్నారు భగవాన్. మనకు ఏదైనా కోరిక తీవ్రంగా ఉంటే అది ఏదో జన్మలో నెరవేరుతుంది అయితే ఆకోరిక నిజమా అంటే నిజంకాదు. శ్రీకృష్ణచైతన్య పూరిక్షేత్రానికి ఆకర్షింపబడ్డాడు. ఒకసారి శ్రీకృష్ణచైతన్య తన గురువు దగ్గరకు వెళ్ళి సన్యాసం తీసుకోవాలని ఉంది, అందుచేత నాకు సన్యాసం ప్రసాదించమని అడుగుతాడు. అప్పడు గురువు గారు ఏమని చెప్పారంటే అంటే సన్యాసం తీసుకోవాలంటే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఉండాలి. మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం లేకుండా సన్యాసం తీసుకోవటం మంచిదికాదు అని చెప్పారు. నేను సన్యాసిగా జీవించగలను అని శ్రీకృష్ణచైతన్య గురువుతో చెప్పారు. అప్పడు గురువుగారు కొంచెం పంచదార తెచ్చి శ్రీకృష్ణచైతన్య నాలుకమీద వేసారు, ఒక నిమిషం తరువాత ఆయన నోటిలోని పంచదారను తీస్తే వేసినప్పడు ఎలాఉందో తీసిన తరువాత కూడా అలాగే ఉంది, తడి అవ్వలేదు. ఇప్పడు నువ్వు సన్యాసానికి ఫిట్ అవుతావు అన్నారు గురువుగారు. మనకు పంచదార నోటిలో వెయ్యనక్కరలేదు, చూస్తేనే లాలాజలం ఊరుతుంది.

ప్రథమవికారం అహంకారం, అది కాలిబూడిద అయ్యేవరకు మనకు ఏదో శరీరంవస్తూ ఉంటుంది ఎందుచేతనంటే అది శరీరం లేకుండా ఉండలేదు. ఆ ప్రథమవికారం వచ్చాక మిగతావికారాలు వస్తాయి అది రాకపోతే ఏదిరాదు. మనకు గాఢనిద్రలో ఆమొదటివికారంలేదు కాబట్టి మిగతావికారాలులేవు. జాగ్రదవస్థలోనికి వచ్చాక దేహంతో తాదాప్యం పొందే ఆమొదటివికారం వచ్చాక ఇంజను వెనకాల పెట్టెలు వచ్చినట్లు మిగతావికారాలు అన్నీ వస్తాయి. మన స్వరూపం శాంతి అయినప్పటికీ మనకు అశాంతి రావటానికి కారణం, మనకు దుఃఖం రావటానికి కారణం మనం ఏదోఒకటి అనుకొంటూ ఉంటాము, ఏదోఒకటి అనుకోకుండా ఈ ప్రథమవికారం ఉండలేదు. మన అమాయకత్వం ఎక్కడ ఉంది అంటే వారిలాగ ఉంటే బాగుండను, వీరిలాగ ఉంటే బాగుండును, వచ్చే జన్మ అలాగ ఉంటే మనకు సుఖంగా వెళ్ళిపోతుంది అని ఇలా ఏదోఒకటి అనుకొంటూఉంటాము కాని వారు ఎంత దుఃఖం అనుభవిస్తున్నారో మనకు తెలియదు. ఒక్క మన స్వరూపంలో తప్పించి బయట ఎక్కడా, ఏ వస్తువులోను సుఖంలేదు, ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి బయట ఎక్కడైనా సుఖం ఉన్నట్లు నీకు అనిపిస్తూఉంటే వూరికే నీకు అలా అనిపిస్తోంది గాని నిజంగా అక్కడ సుఖంలేదు, అవి మిధ్యాసుఖాలు, అవే రాబోయేజన్మలో దుఃఖాలుగా

వస్తాయి. అందుచేత మనం ఈ అనుకోవటాలు, ఊహించుకోవటాలు తగ్గిస్తే మనకు భయం తగ్గుతుంది, కోపం తగ్గుతుంది, చిరాకు తగ్గుతుంది, ఉద్రేకాలు తగ్గుతాయి. నిన్ను నీవు తెలుసుకోవటానికి అంతఃకరణశుద్ధిని సంపాదించుమని సనత్కుమారుడు నారదుడికి చెపుతాడు, నేను ప్రపంచంలో ఉన్న అన్ని విద్యలు నేర్చుకొన్నాను, ఎంతో పాండిత్యం ఉంది, కీర్తి ఉంది కాని నాకు దుఃఖం నశించలేదు అని నారదుడు సనత్కుమారుడిని అడిగితే అప్పుడు బ్రహ్మవిద్యను బోధిస్తాడు. ఏ వస్తువులో దుఃఖం ఇనుమంతయు కూడా లేదో, ఆ వస్తువు అనుభవంలోనికి వచ్చేవరకు దుఃఖం నిన్ను విడిచిపెట్టదు నిన్ను నీవు తెలుసుకో అంటే నీవు ఎవడిగా ఉన్నావో వాడిని తెలుసుకో నీవు ఆత్మవు, నీకు ఆత్మానుభవం కలిగినప్పుడు సుఖం స్వరూపంగా వ్యక్తమవుతుంది. ఆత్మజ్ఞానం లేనివాడికి ఆత్మసుఖం లేదు, అమరత్వం లేదు. నాకు సుఖం అక్కరలేదు అని చెప్పేవాడు ఎవడైనా జీవకోటిలో ఉన్నాడా అంటేలేడు. కాని సుఖం ఎక్కడలేదో అక్కడ మనం సుఖం కోసం వెతుకుచున్నాము, ఇలా వేలాదిజన్మలు వెళ్లిపోతున్నాయి. సుఖం ఎక్కడ ఉందో నీకు తెలియజేసి, అక్కడ వెతకటానికి నీకు సహాయసహకారములు అందించేవాడే గురువు. ఎక్కడైతే సుఖం ఉందో అటువైపుకు నీ మనస్సును మళ్లించేవాడే గురువు. మనం అనుకోవటాలు ప్రారంభించగానే అశాంతి, దుఃఖం కూడా వచ్చేస్తాయి, ఇప్పుడు మనం అహంకారం మీద భారంవేసి జీవిస్తున్నాము భగవంతుడి మీద భారంవేసి జీవించటం నేర్చుకోండి.

మనం జీవితంలో భౌతికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని అభివృద్ధిలోనికి రావాలంటే ఏకాగ్రత ముఖ్యం. భగవంతుడిని స్మరించగా, స్మరించగా నీకు పవిత్రత కలుగుతుంది, ఏకాగ్రత కలుగుతుంది, ఏకాగ్రత కుదిరినవాడికి మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది. మనం ఏకాగ్రత, పవిత్రత ఇవి రెండూ సంపాదిస్తే మనహృదయంలోఉన్న సత్యవస్తువు మనకు అనుభవంలోనికి వస్తుంది. తలంపుల విషయంలోను, మాటల విషయంలోను బహూజాగ్రత్తగా ఉండాలి. ఎప్పుడైనా మనం పొరపాటుమాటలు మాట్లాడితే టైము చూసుకొని భగవంతుడు వెయ్యవలసిన మొట్టికాయలు వేస్తాడు. పాండవులు జూదంలో ఓడిపోయినప్పుడు కర్ణుడు ద్రౌపతితో వారు నీకు భర్తలా, పాండవులను వదిలెయ్యి, ధుర్యోధనుడిని పెళ్లిచేసుకో అంటాడు. కర్ణుడు ఆమాట అనేవరకు ద్రౌపతిని అవమానం చేద్దామనే బుద్ధి దుర్యోధనుడికి లేదు. ఆమాట అన్నాకే ధుర్యోధనుడికి చెడ్డబుద్ధి కలిగింది. మనం మాటల దగ్గర ఎందుకు జాగ్రత్తగా ఉండాలంటే కర్ణుడు ఆమాటలు అన్నాడు అయిపోయింది, తరువాత కొంతకాలానికి యుద్ధం ప్రారంభమయ్యింది కర్ణుడికి, అర్జునుడికి యుద్ధం జరుగుతూఉంటే కర్ణుడి రథం భూమిలో దిగిపోయింది. అతడు మాట్లాడిన తప్పుడు మాటలు అనుభవించే టైము వచ్చింది. రధచక్రాన్ని పైకి ఎత్తటానికి దిగుతూ చక్రం పైకి తీసుకొంటాను, యుద్ధం చేయకు, ఇది ధర్మంకాదు అంటాడు, అర్జునుడు ఆలోచిస్తాడు, కాని కృష్ణుడు వాడికి ధర్మం ఏమిటి? చంపెయ్యి అంటాడు. ద్రౌపతిని మాటలు అన్నప్పుడు వాడికి ధర్మం ఏమయింది, నీవు ఆలోచించవద్దు, వాడిని చంపెయ్యి అని భగవంతుడు



చెపుతాడు. అందుచేత మనం ఏదైనా చెడ్డపని చేసినా, చెడ్డమాట్లాడినా తిరిగి మనం అనుభవించవలసిందే, అలా మనచేత అనుభవింపజేయటానికి పరిస్థితులు క్రియేట్ చేసేవాడే పరమాత్మ, నీవు ధర్మాన్ని కాపాడితే ధర్మం నిన్ను కాపాడుతుంది. మీరు ఎవరినైనా అవమానపరిచే మాటలు మాట్లాడితే మరల వారిచేత మాటలుపడే రోజులు మీకు తీసుకొని వస్తాడు. కొంతమంది అవసరం లేకపోయినా అహంకారం కోసం మాట్లాడుతూ ఉంటారు, అది చాల ప్రమాదం.

ఒక్కజ్ఞాని మాత్రమే నిజమైన సుఖి, వాడు ఆత్మానందాన్ని జుర్రుకొంటూ ఉంటాడు. అటువంటి ఆత్మజ్ఞానం ఎవరికైతే ఉందో వారిని ఆశ్రయించి, వారికి సేవచేసి, వారిని గౌరవించి ఆత్మజ్ఞానాన్ని సంపాదించు అని పరమాత్మ చెపుతున్నాడు. జ్ఞానికి అటువంటి గొప్పస్థానాన్ని ఇచ్చాడు. కాని మన పరిస్థితి ఎలాఉంది అంటే జ్ఞానికి శరణాగతి చెందటం మాట అటు ఉంచండి కనీసం జ్ఞానిపట్ల మనకు కృతజ్ఞత కూడా లేదు. ప్రతీదానికి కర్తృత్వం పెట్టుకోవద్దు, భగవంతుడి మీద భారంవేసి జీవించటం నేర్చుకోండి. బయట సంఘటనలవలన దుఃఖం వస్తోంది అని మీరు అనుకొంటున్నారు కాని దుఃఖానికి కారణం బయటలేదు, దుఃఖానికి కారణం కర్తృత్వం, ఆ కర్తృత్వం నశిస్తే దుఃఖం నిన్ను ముట్టుకోదు. మనసాధన యొక్క గురిఅంతా దుఃఖకారణం అయిన కర్తృత్వం మీదే పెట్టాలి. శరీరం నశిస్తే దుఃఖం నశించదు, కర్తృత్వం నశిస్తే దుఃఖం నశిస్తుంది. ఈబాధలు పడలేకపోతున్నాము చనిపోతే బాగుండును అని కొంతమంది అనుకొంటూ ఉంటారు. మన శరీరానికి సహజంగా మరణం రానివ్వాలి కాని బలవంతంగా చనిపోకూడదు బలవంతంగా చనిపోతే ఈజన్మలో దుఃఖం, రాబోయేజన్మలో దుఃఖం కూడా అప్పుడే అనుభవించవలసి ఉంటుంది. అది అలాజరగాలి, ఇది ఇలాజరగాలి అని మీరు అనుకొంటూ ఉంటారు. మీరు అనుకొన్నట్లుగా జరగకపోతే దుఃఖం వస్తుంది. భగవంతుడు ఎలాచేస్తే అలాగ అనుకొంటే, ఆభావన మీకు కుదిరితే మిమ్మల్ని అదృష్టం వెంటాడుతూ ఉన్నా, దురదృష్టం వెంటాడుతూఉన్నా మీరు దుఃఖరహితంగా జీవించగలరు, శరీరానికి మరణంవచ్చినా మీకు ఏమి అనిపించదు.

మీరు సాధన బాగాచేస్తూఉంటే మీకు కొన్ని మహిమలు రావచ్చు, అవిచూసి అవినయం తెచ్చుకోకూడదు, గమ్యానికి చేరేవరకు బహుజాగ్రత్తగా ఉండాలి. మీ ప్రారబ్ధాన్ని బట్టి మీకు ధనం వచ్చినా, అధికారం వచ్చినా అవినయం రాకుండా చూసుకోవాలి. ఎందుచేతనంటే నీరు పల్లానికి వెళ్లటం ఎంత సహజమో వినయంగలవాడికి జ్ఞానం రావటం కూడా అంతే సహజం. అహంకారం పైకి ఎగురుతూ ఉంటుంది, కిందపడుతూ ఉంటుంది కాని లోపలఉన్న బ్రహ్మం ఎప్పుడూ సమానంగా ఉంటుంది, మన మనస్సు అంత సమానం అయితేగాని అది బ్రహ్మంలో ఐక్యంకాలేదు. మన మనస్సులో కొంచెం దోషంఉన్నా కూడా అది బ్రహ్మంలో ఐక్యంఅయ్యే అవకాశంలేదు. మనం భగవంతుడిమీద భారంవేసి జీవిస్తూఉంటే, ఆయనమీద ఉన్న విశ్వాసంలో కొరత లేనప్పుడు మన మాట, మన మనస్సు,

మనచేత  అన్నీ కూడా ఆయనను తెలుసుకోవటానికి సహకరిస్తాయి. కుటుంబసభ్యులపట్ల, స్నేహితులపట్ల నీడ్యూటీ నీవుచేయాలి అంతేగాని మమకారం పెట్టుకోకూడదు, డ్యూటీ చేయటంవలన దుఃఖంరాదు, మమకారం వలన దుఃఖం వస్తుంది. ప్రతీమనిషికి వాడంటేనే వాడికి బాగాఇష్టం.  మీభర్త అనుకూలంగా ఉంటే భర్త అంటే ఇష్టపడతారు అంతేగాని మీభర్త కంటే కూడా మీరంటేనే మీకు ఎక్కువఇష్టం.  ప్రతీమనిషికి తనుఅంటే తనకు ఎక్కువఇష్టం ఎందుచేతనంటే తను ఆత్మ అయిఉన్నాడు కాబట్టి.  ఎవరైనా మీకు ఉపకారం చేస్తే వారిని ప్రేమిస్తారు, ఎవరైనా మీకు అపకారంచేస్తే వారిమీద మీకు ఇష్టం ఉండదు, అక్కడ కూడా కేంద్రం మీరే.  ఇది నేనుకాదు, ఇది నేనుకాదు అని అన్నింటిని తొలగించుకొంటూ వెళితే మిగిలేది నువ్వే. గాఢనిద్రలో మనం అన్నింటిలోనుండి విడిపోతున్నాము కాని అక్కడ మనం ఉన్నాము.  మనం ఏదైతే కాదో అందులోనుండి విడిపోగలము కాని ఏదైతే మనమో అందులోనుండి మనం విడిపోలేము, దానిని తెలుసుకోవటమే జ్ఞానం.

నేను అనే తలంపు నీకు లోపలనుండి వస్తోంది.  ఈ సృష్టికంతకు ఏవస్తువు అయితే ఆధారంగాఉందో అది నీ హృదయంలోకూడా ఉంది, అక్కడనుండే ఈనేను అనే తలంపు వస్తోంది, ఇది ముందు నీకు అర్ధమవ్వాలి.  ఈ మూలతలంపు మూలంలోనే చైతన్యం ఉంది. మూలతలంపు దానిమూలంలోనికి వెళితే అది నశిస్తుంది.  మూలతలంపు నశిస్తే నీవు నశించవు, నీవు ఏదిగా ఉన్నావో అది నీకు అనుభవంలోనికి వస్తుంది, చైతన్యం అనుభవంలోనికి వస్తుంది.  చైతన్యం అనుభవంలోనికి వచ్చినప్పుడు  ఇప్పటివరకు నీవు పడిన కష్టాలు, చావులు, పుట్టుకలు, ఈజన్మలు, భోగాలు ఇవిఅన్నీ అసత్యం అని అప్పుడు నీకు తెలుస్తుంది.  అది ప్రత్యక్షానుభవం. ఏదో ఊహలమీద, ఎవరోచెప్పిన మాటలమీద ఆధారపడనక్కరలేదు.  మాటలకంటే అనుభవం ముఖ్యం.  నిప్పుమీద చేయివేస్తే కాలదుఅని ఎవరైనా చెప్పినా మనం నమ్ముతామా? నమ్మము ఎందుచేతనంటే అది మన అనుభవం, భగవంతుడు చెప్పినమాటను భగవంతుడితో సమానంగా గౌరవించాలంటే మీకు పుణ్యబలం ఉండాలి, సత్కర్మచేసి ఉండాలి. భక్తి లేకుండా శక్తిరాదు, భక్తిలేకుండా జ్ఞానంరాదు.  గుణాలు మనలను పీడిస్తూఉంటాయి, ఈ గుణాలగొడవను, ఈ గుణాలతో తాదాప్యాన్ని వదిలించుకోవాలి.  కళ్యాణగుణాలు కూడా వ్యవహారికసత్యమేగాని అవి ఆత్మజ్ఞాన సముపార్జనకు సహకరిస్తాయి.  మనకు గాఢనిద్రలో గుణాలు ఎక్కడ ఉన్నాయి, అవికూడా మనం కల్పించుకొన్నవే. ద్వేషం ఉన్నచోట అశాంతి ఉంటుంది, ప్రేమ ఉన్నచోట శాంతి ఉంటుంది, నీకు ద్వేషం ఎప్పుడైతే ప్రారంభమయ్యిందో అప్పుడు అశాంతి వచ్చేస్తుంది, లోపల క్షోభ ప్రారంభమవుతుంది. మనం ఎవరినైనా చూసి అసూయపడుతూఉంటే చనిపోయిన తరువాత ఏమౌతాము అనే గొడవ ప్రక్కన పెట్టండి, ముందు మన శారీరకఆరోగ్యం, మానసిక ఆరోగ్యం చెడిపోతుంది. అసూయ రాకూడదు కాని, అసూయవస్తే 24 గంటలు కాలిపోతూ ఉంటాము, జ్ఞాని ప్రేమించకుండా ఉండలేడు, అజ్ఞాని ద్వేషించకుండా ఉండలేడు, ఒకసారి

**5-4-2004**

భగవాన్ రంగన్‌తో నేను పొందవలసింది ఏదో పొందాను, నేను చేయవలసిన పని అంటూ ఏమిలేదు అన్నారు.  అప్పుడు రంగన్ భగవాన్‌తో చేయవలసినది ఏదిలేదు అంటున్నావు మరి నాతో ఎందుకు మాట్లాడుతున్నావు అని అడిగారు. అది పని ఉండి మాట్లాడటంకాదు, ప్రేమే మాట రూపంలో వస్తోంది, కరుణే మాట రూపంలో వస్తోంది అన్నారు. అమృతానుభవం పొందితే వాడు కళ్ళుమూస్తే ప్రేమ, తెరిస్తే ప్రేమ ఆ శరీరం ఉంటే ప్రేమ, లేకపోయినా ప్రేమే, వాడే ప్రేమ.  మనకు లోపల ప్రేమలేదు కాబట్టి ప్రేమను నటిస్తాము, వాడు ప్రేమ నటించనక్కరలేదు ఎందుచేతనంటే వాడే ప్రేమ.  మనకు నిజంగా వారిమీద ప్రేమ ఉండదు కాని మనకు వారిమీద ప్రేమ ఉంది అని వారు అనుకొంటే చాలు అని మనం అనుకొంటాము,  ఇలా మన అహంకారం సంతృప్తిపడితే మనకు సరిపోతుంది ఇదీ మన పరిస్థితి, ఇది అజ్ఞానలక్షణం మనం జ్ఞానం కోసం బ్రతకటంలేదు, అహంకారం కోసం బ్రతుకుతున్నాము.  జ్ఞానిలో రియాక్షన్ ఉండనే ఉండదు, జ్ఞానిలో ప్రేమ తప్పించి ఏమీ ఉండదు భగవాన్ శరీరం విడిచిపెడతారు అనగా చివరి రోజులలో ఒక భక్తుడు భగవాన్‌తో మీ సమక్షంలో శాంతిని, ప్రేమను అనుభవిస్తున్నాము, ఈ శరీరం మరణించాక మమ్మల్ని ఎవరు ప్రేమిస్తారు అని అడిగారు, అప్పుడు భగవాన్ ఏమిని చెప్పారు అంటే ఈ శరీరం ఉన్నప్పుడు కూడా శరీరం మిమ్మల్ని ప్రేమించటంలేదు, ఏదైతే మిమ్మల్ని ప్రేమిస్తోందో దానికి చావులేదు. అందుచేత ఈ శరీరం పోతుందిగాని ప్రేమ అలా ప్రవహిస్తూనే ఉంటుంది. శరీరానికి, ప్రేమకు ఎట్టి సంబంధంలేదు అని చెప్పారు.

బ్రహ్మానుభవం పొందినవాడికి లోకం లోకంగా కనిపించదు, బ్రహ్మంగానే కనిపిస్తుంది.  అందుచేత వాడు చూసేది బ్రహ్మం, వినేది బ్రహ్మం, అనుభవించేది బ్రహ్మం. చెఱుకుగెడను ముక్కలుక్రింద కోస్తాము, ముక్కలుక్రింద కోసాము అని కోపగించి తీపిదన్నాన్ని విడిచిపెట్టేసి అది మనకు చేదును ఇవ్వదు, ఆ ముక్కలు తియ్యగానే ఉంటాయి. జ్ఞానియొక్క పరిస్థితి కూడా అంతే, జ్ఞానియొక్క స్వరూపం అటువంటిది. ఏదివిన్నా బ్రహ్మమే, అంతా మధురమే. మీ హృదయంలో సత్యవస్తువు ఉంది.  మీకుటుంబంకోసం, గౌరవాలకోసం, అధికారంకోసం మీరు ఎంత కష్టపడుతున్నారో, హృదయంలోఉన్న వస్తువును తెలుసుకోవటానికి అందులో 50% కష్టపడినా, ఆ వస్తువు మీకు అనుభవంలోనికి వస్తుంది. మీ కుటుంబాన్ని మీరు ఎంత ప్రేమిస్తున్నారో అందులో సగం ప్రేమ ఈశ్వరుని మీద ఉంటే, ఆ ప్రేమప్రవాహంలో మీరాగద్వేషములు కరిగిపోతాయి, ఇదివరకు మనకు రాగద్వేషాలు ఉన్నాయి అనే ఆచూకి కూడా తెలియకుండాపోతాయి, అట్టిది ఆవస్తువు తాలుక అనుభవం, అట్టిది ఆ ప్రేమ. మీరు అనేకజన్మల నుండి పుణ్యకర్మలు చేయగాచేయగా, సాధనచేయగా చేయగా మీతపనను చూసి లోపలఉన్న ఈశ్వరుడే గురురూపంలో వస్తాడు.  మీకు గురువు మీద ప్రేమఉంటే, ఈశ్వరుడి మీద ప్రేమఉంటే ఆ ప్రేమప్రవాహంలో మీరాగద్వేషాలు కాలిపోతాయి, బూడిదకూడా కనబడదు. అప్పుడు మీహృదయంలో ఉన్న నిజమే మీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది.

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 07-04-04 | బుధ | పోడూరు వీరభద్రస్వామి ఆలయం |
| 13-04-04 | మంగళ | భీమవరం DNR College ఆడిటోరియమ్ |
| | | శ్రీ ఉద్దరాజు ఆనందరాజు గారి వర్ధంతి సందర్భంగా |
| 24-04-04 | శని | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం శంకర జయంతి సందర్భంగా |

## "రుచులను మరిగిన "జిహ్వా" వాంఛల్లి రెచ్చగొడుతుంది"

ఆరోగ్యమే మహాభాగ్యం అది మన చేతుల్లోనే ఉంది. శరీరఆరోగ్యం ఆత్మానందానికి సహాయకారిఔతుంది, శరీరం వ్యాధిగ్రస్తమైతే మనస్సు దాని మీద కేంద్రీకృతమౌతుంది - జీవితగమ్యాన్ని తప్పిపోతాము, తినటం కోసం బ్రతికితే తిప్పలు తప్పవు, బ్రతకటం కోసం తింటే బాగుపడతాము. రుచుల నీడ మనిషిని సదా వెంటాడి వస్తుంది. నాశనమైపోయే శరీరం యొక్క శోభను, వయస్సును పెంచటానికే ఇతర ప్రాణులను బలిచేయకూడదు, భూతదయ భగవంతుని సన్నిధికి చేరుస్తుంది. మాంసాహారం మానవుని మనస్సును క్రూరత్వంగా తయారుచేస్తుంది. దాన్ని నువ్వుగింజలో నూరోవంతు తిన్నా ఆధ్యాత్మికప్రగతికి అది బద్ధవిరోదం. విరిగిన మనస్సును ప్రేమతో అతికించవచ్చునేమోగాని చంపబడ్డప్రాణిని బ్రతికించలేము, మాంసం తినటంవల్ల ఆజంతు సంస్కారాలను మనం తీసుకొంటాము. శాఖాహారం భోజనంలో ఆ జీవులు మనస్సుతో తాదాప్యం జడప్రాయంగా ఉండటంవల్ల కర్మలభారం తక్కువ. ఏదిబడితే అది ఎలాబడితే అలా ఎక్కడబడితే అక్కడ తినకూడదు, నిర్ణీతమైన సమయంలో పక్వమైన ఆహారాన్నియుక్తంగాను. ధర్మజీవనంతో కూడిన దాన్ని తీసుకోవాలి. బజారు చిరుతిళ్ళతో, ఆ వండబడేవాని లాభాపేక్షతో కూడిన పిసినార సంస్కారంతో పాటు అన్ని సంస్కారాలు, మనకు సంక్రమిస్తాయి. ఒక సాధువు ఒక హోటల్‌లో భోజనం చేసాడు, వంటవానికి పేపరు చదివే పిచ్చిబాగా ఎక్కువ. అనతికాలంలోనే సాధువుకు ఆపిచ్చి ఎక్కింది, ఆహారం తయారుచేసే స్థలంలో జరిగే కలహాలు, వత్తిళ్ళు అజీర్తికి కారణమౌతాయి. వడ్డింపులు, ఆరగింపులు ప్రశాంత వాతావరణంలో జరగాలి. శబరి ప్రేమతో కూడిన పళ్లరుచి తిన్న శ్రీరామునకు అయోధ్యలో ఏమధుర ఆహారం దానికి సాటిరాలేదు. ప్రీతితో పెట్టనిది పరమాన్నమైనా పిండాకూడుతో సమానం. సాత్వికఆహారం వల్లసాధనలో సగభాగం అదే తేలిక జేస్తుంది. మషాలాలు నిల్వపచ్చళ్ళు మానాలి. సాత్విక ఆహరంతో జీవించే గాంధీజీ ధీమాగా యిలా అన్నారు "నన్ను ఎవ్వరూ చంపక పోతే నేను వంద సంవత్సరాలు జీవించగలను" కాబట్టి రుచులపై అంకుశం పెట్టక తప్పదు. అలాచేసేవారు సద్గురువులకు శ్రమను తగ్గించిన వారమై నిర్వికారస్థితిని త్వరలో పొందగలం.

**సాగిరాజు రామకృష్ణంరాజు** - అర్ధవరం



**పాలకొల్లు ది. 21-03-2004న సద్గురు శ్రీ నాన్నగారికి గురుసత్కారం చేస్తున్న శ్రీ వసిష్ఠ సేవాశ్రమ అధినేత ఆచార్య శ్రీ కె.జి. ప్రసాదరాజుగారు**





**సద్గురు శ్రీ నాన్నగారికి గురు సత్కారం చేస్తున్న డా॥ సి.హెచ్. సత్యనారాయణ మూర్తి (బాబ్జి) దంపతులు**

### రమణభాస్కర పాఠకులకు మనవి !

రమణభాస్కర అందకపోయిన, మీ అడ్రస్సు మారిన, వెంటనే మీ పేరు ముందు ఉన్న నెంబరును వ్రాస్తూ డోర్ నెంబరు, వీధిపేరు, ఏరియా, పిన్‌కోడ్‌తో సహా సరియైన పూర్తి అడ్రస్సుతో కార్డు వ్రాయండి. వెంటనే పంపబడతాయి.